క్లుప్తంగా

పంటల చుట్టూ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయొద్దు

సోన్: రైతులు పంట పొలాలకు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సంతోషం రవీందర్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పంటలను పందులు, కోతుల నుంచి రక్షించుకునేందుకు చేను గట్ల వద్ద కరెంట్ తీగలు ఏర్పాటు చేయవద్దని హెచ్చరించారు. గతంలో ఇలాంటి చర్యలకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకొని.. కేసులు నమోదు చేశామన్నారు.

మొదటి గెల తొలగించాలి


జోహర్‌పూర్‌లో పరిశీలిస్తున్న శేఖర్

లోకేశ్వరం: ఆయిల్‌పాం సాగు చేసిన రైతులు మొదటి ఏడాదిలో వచ్చిన గెలను తొలగించాలని ఆయిల్ పాం క్లస్టర్ అధికారి శేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని జోహర్‌పూర్, కన్కపూర్ గ్రామాల్లో సాగు చేసిన ఆయిల్‌పాం మొక్కలను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. మొదటి గెలను తొలగిస్తే మొక్క పెరుగుదల జరుగుతుందన్నారు. ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందని..రైతులు ఆయిల్‌పాం సాగు చేయాలని కోరారు. వారి వెంట రైతులు ఉన్నారు.

రాయితీ గొర్రెలు పంపిణీ


లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ప్రదీప్‌కుమార్

కుంటాల: స్వరాష్ట్రంలోనే గొల్ల, కుర్మల అభివృద్ధి జరుగుతుందని సర్పంచుల సంఘం మండల కన్వీనర్ ముజ్గే ప్రదీప్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని అంబకంటి గ్రామంలో 24 మంది గొల్ల, కుర్మలకు 24 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేశ్, పశువైద్యాధికారి ప్రకాశ్, ఏఎంసీ డైరెక్టర్ గైని సాయినాథ్, జేవీవో శశిధర్, డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

కుంటాల: మండల కేంద్రంలో ఆదివారం శ్రీగజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. గజ్జలమ్మకు అభిషేకం, అలంకరణ, పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

బీసీలకు చెక్కులు పంపిణీ


చెక్కు అందిస్తున్న శ్యాంసుందర్

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఇద్దరికీ రూ.లక్ష చొప్పున బీసీ సాయం చెక్కులను జెడ్పీ మాజీ చైర్మన్ శ్యాంసుందర్ పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో మురికి కాలువల నిర్మాణం కోసం జెడ్పీ నిధులు రూ.రెండు లక్షలు మంజూరవగా.. పనులకు భూమిపూజ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు కపిల్, భోజన్న, భుజంగ్‌రావు, సుధాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఉత్తం, శ్యాంసుందర్, సాయారెడ్డి, బండి ప్రశాంత్, భీంరావు ఉన్నారు.

ఆటో యూనియన్ కార్యవర్గం


సభ్యులను సన్మానిస్తున్న యూనుస్

కుంటాల: మండలంలోని ఓలా ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా సంతోష్, ఉపాధ్యక్షుడిగా రహూఫ్, సభ్యులుగా ఫిరోజ్, నియాజ్, అన్సార్, మధు, మొసిన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని కాంగ్రెస్ నాయకులు ఎండీ.యూనుస్ సన్మానించారు.

విరాళం అందజేత


విరాళం అందిస్తున్న దాత

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలోని మహాలక్ష్మి ఆలయానికి నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం ముప్కాల్‌కు చెందిన నాగమణి-వెంకట్ దంపతులు రూ.25 వేల విరాళం అందజేశారు. ఆలయ పునర్నిర్మాణం దాతల సహకారంతో చేపట్టామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సతీశ్‌రావు, లింగేశ్వర్, పంబాల భీమేశ్వర్, మాదాసు రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

పరిహారం ఎప్పుడిస్తరో..?

- వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- నిండా మునిగిన రైతులు
- సర్వే చేసి.. సాయం మరిచిన ప్రభుత్వం


ధార్‌కుభీర్‌లో కొట్టుకుపోయిన పంట


గొడ్సరలో పంటలతోపాటు కొట్టుకుపోయిన మట్టి

కుభీర్: భారీవర్షాలు, ఈదురుగాలులకు పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులకు జరిగే నష్టం.. అంతా ఇంతా కాదు. ఆరుగాలం కష్టించి పని చేస్తే పెట్టుబడులూ రాని అన్నదాతలకు కన్నీరే దిక్కు. నష్టపోయిన కర్షకులను సాయం అందించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వ్యవసాయాధికారులు సర్వే చేసి చేతులు దులుపుకుంటున్నారు. కానీ సాయం మాత్రం బాధితులకు అందడం లేదు.

1800 ఎకరాల్లో నష్టం..

కుభీర్ మండలంలో సాగు భూమి 50వేల ఎకరాల వరకు ఉండగా.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 1800 ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం జరిగింది.ఇందులో 1300 ఎకరాల్లో పత్తి, 500 ఎకరాల్లో సోయా పంటలు ఉన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. వాగులపై వంతెనలు, చెరువు కట్టలు తెగిపోవడంతో పంటలు కొట్టుకుపోవడంతోపాటు వరద కారణంగా పలు చోట్ల ఇసుక మేటలు వెలిశాయి. మండలంలోని దొడర్నా, కుభీర్ ఎల్లమ్మ చెరువు కట్టలు తెగిపోయాయి. నష్టపోయిన పంటలను సర్వే చేసి ఉన్నతాధికారులకు పంపించామని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. కానీ ప్రభుత్వం నుంచి ఇప్పటికీ ఏ ఒక్క రైతుకు పరిహారం అందలేదు.

గతేడాది సైతం రాలే..

గతేడాది వర్షాకాలంలోనూ మండలంలో సుమారు 800 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. వ్యవసాయాధికారులు సైతం ఇలానే సర్వే చేసి వదిలేశారు. కానీ పరిహారం అందలేదు.

పట్టించుకోని అధికారులు, పాలకులు..

ఏటా ప్రకృతి విపత్తులతో రైతులు తమ పంటలను నష్టపోయినప్పుడు ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆదుకుంటామనడం.. ఆ తర్వాత వారిని పట్టించుకోకపోవడం సాధారణమైంది. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరిశీలించి ఎకరాకు రూ.10వేలు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ అమలు కాలేదు. కిందిస్థాయి అధికారులను రైతులు అడిగితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేశామని.. పరిహారం ఎప్పుడు వస్తోందో తమ తెలియదని పేర్కొంటున్నారు. దీంతో అన్నదాతలే వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి మళ్లీ పంటలు సాగు చేసుకుంటున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు రాలేదు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నష్టపోయిన పంటలను సర్వే చేశాం. ప్రభుత్వం అందించే పరిహారం విషయమై ఎలాంటి ఆదేశాలు రాలేదు. మాకు సమాచారం రాగానే రైతులకు చెబుతాం.

– వికారుద్దీన్, మండల వ్యవసాయాధికారి

మూడెకరాల్లో కొట్టుకుపోయింది



ఇటీవల మూడెకరాల్లో పత్తి పంట సాగు చేశా. చేను వాగు ఒడ్డున ఉండటంతో ఇటీవల వర్షాలకు మొత్తం పంట కొట్టుకుపోయింది. దుక్కి దున్నడం, విత్తనాలు ఎరువుల రూపంలో రూ.30వేల వరకు ఖర్చయింది. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– బంక బాబు, రాజురా

రూ.20వేలు నష్టపోయా..



మండల కేంద్రంలో ఎల్లమ్మ చెరువు కట్ట తెగిపోవడంతో రెండెకరాల్లో సోయా పంట నష్టపోయా. మళ్లీ పంట వేద్దామంటే మట్టి సైతం కొట్టుకుపోయింది. సుమారు రూ.20వేల వరకు నష్టపోయాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

– వద్దం పోతన్న, కుభీర్

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీవోలు


నర్సాపూర్(జి): బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న ఆర్డీవో రత్నకల్యాణి


సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఉట్నూర్ ఆర్డీవో జీవన్‌రెడ్డి

నర్సాపూర్(జి):18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో రత్నకల్యాణి సూచించారు. ఆదివారం మండలంలోని రాంపూర్, నర్సాపూర్(జి) గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం పరిశీలించారు. ఇప్పటివరకు 60 దరఖాస్తులు వచ్చినట్లు బీఎల్‌వోలు.. ఆర్డీవోకు తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గజానన్, ఆర్ఐ వేణుగోపాల్, సీనియర్ అసిస్టెంట్ నగేష్, బీఎల్ఓలు గంగామణి, అరుణ, సునీత, ప్రేమల, గోదావరి, స్వర్ణలత, కంప్యూటర్ ఆపరేటర్ ఫిర్దొస్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఉట్నూర్ ఆర్డీవో జీవన్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం బీఎల్‌వోలు పలువురి నుంచి ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో అర్ఐ రాజేశ్వర్, బీఎల్‌వోలు సుకన్య, చందురాణి తదితరులున్నారు.

ప్రక్రియ పరిశీలించిన తహసీల్దార్లు..

దస్తురాబాద్: మండలంలోని పెర్కపల్లె, మున్యాల, గొడిసీర్యాల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆదివారం తహసీల్దార్ ఎండీ జాకీర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ జాబితా గోడలకు అంటించామని.. జాబితాలో పేర్లు నమోదు కాని వారు, మార్పులు, చేర్పుల కోసం బీఎల్‌వోలను సంప్రదించాలన్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ గంగన్న, బీఎల్‌వోలు తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: బీఎల్‌వోలు అందుబాటులో ఉండి ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టాలని తహసీల్దార్ మోతీరాం అన్నారు. ఆదివారం మండలంలోని పుస్పూర్ గ్రామంలోని పోలింగ్ బూత్ కేంద్రాన్ని తహసీల్దార్ పరిశీలించి మాట్లాడారు. వచ్చే నెల 3,4 తేదిల్లోనూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. తప్పులుంటే బీఎల్‌వోలకు తెలియజేయాలని సూచించారు. వారి వెంట ఆర్ఐ బాలకిషన్, పలువురు బీఎల్‌వోలు ఉన్నారు.

కుంటాల:వచ్చే అక్టోబర్ నాటికి 18 ఏళ్లు నిండే యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీటీ నరేశ్‌గౌడ్, ఆర్ఐ అడెల్లు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు


కాంగ్రెస్‌లో చేరిన వారితో వెడ్మ బొజ్జు

పెంబి: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావడంతోపాటు ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని టీ పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనను భూస్థాపితం చేయడానికే కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. చెవెళ్ల డిక్లరేషన్‌లో ఎస్సీలకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఇందులో భాగంగా తుడుందెబ్బ మండల అధ్యక్షుడితో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ పెంబి, ఖానాపూర్, దస్తురాబాద్, ఇంద్రవెల్లి మండలాల అధ్యక్షులు స్వప్నీల్ రెడ్డి, దయానంద్, మల్లేశ్, ముఖ్కాడే ఉత్తం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగారాజన్న, నాయకులు శంకర్, మహేందర్, భీంరావు తదితరులు ఉన్నారు.

క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న రాంచందర్

నిర్మల్‌ఖిల్లా: ఈనెల 29న హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ హాకీ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాకాల రామచందర్ కోరారు. జిల్లా కేంద్రంలో వ్యాయామ ఉపాధ్యాయులతో ముందస్తు కార్యాచరణ, సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడా దినోత్సవం కార్యక్రమాలు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో ఉదయం 9.30గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి-రాంకిషన్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. వివిధ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొననున్నారని, వీరికి అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి భోజన్న, ఎస్జీఎఫ్ కార్యదర్శి రమణారావు, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి భూమన్న, వినోద్, సుందర్‌సింగ్, అంబాజీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రధనస్సు

కుంటాల: మండలంలోని రాజాపూర్ శివారులో ఆదివారం ఏర్పడిన ఇంద్రధనస్సు కనువిందు చేసింది. పలు గ్రామాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. అనంతరం ఆకాశం నుంచి పొలాలను తాకేలా హరివిల్లు దర్శనమిచ్చింది. పలువురు ఈ సుందర దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

గోండుగూడకు ట్రెయినీ ఐఏఎస్‌లు

దస్తురాబాద్: మండలంలోని గొడిసీర్యాల పరిధిలోని గోండుగూడకు ఆదివారం రాత్రి ట్రెయినీ ఐఏఎస్‌ల బృందం చేరుకుంది. ఈ సందర్భంగా వారికి స్థానిక అధికారులు, ఆదివాసీలు స్వాగతం పలికారు. ఈనెల 31 వరకు ఏడుగురు ట్రెయినీ ఐఏఎస్‌లు గ్రామంలో ఉండి ప్రజల జీవన విధానంపై అధ్యయనం చేయనున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, ఖానాపూర్ ఎంపీడీవో మల్లేశ్, దస్తురాబాద్ ఎంపీడీవో విజయ్ భాస్కర్‌రెడ్డి, కడెం ఎంపీవో ఉపేందర్, దస్తురాబాద్ ఎంపీవో అనిల్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయండి

కడెం: తమ సమస్యలు పరిష్కరించాలని అసంఘటిత రంగ కార్మికులు ఈనెల 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపడుతున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పారిశుధ్య కార్మికులతో కలిసి మహాధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు సీతువోగా పని చేస్తుందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ముస్లింలకు పుస్తకాలు పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఖానాపూర్: పట్టణంలోని ఉర్దూ భవన్‌లో ఆదివారం తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వంద మంది ముస్లింలకు ఉచితంగా ఖురాన్, సీరత్ క్విజ్ పుస్తకాలు పంపిణీ చేశారు. 'ఖురాన్‌తో సంబంధం'కార్యక్రమంలో వీటిని పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్ఞానంతోనే నిజమైన గౌరవం వస్తుందన్నారు. జ్ఞానం అల్లా లక్షణమని.. కార్యక్రమంలో వాహిద్ అహ్మద్ ఖాన్, గులాం దురాని, ముఫ్తీ సయ్యద్, అతరుద్దీన్, మహ్మద్ అమీర్, సర్జిల్ అహ్మద్, ఇజార్ అహ్మద్, పర్వేజ్, తదితరులు పాల్గొన్నారు.

'పొన్కల్‌ను మండలంగా ప్రకటించాలి'


మాట్లాడుతున్న సాధన కమిటీ నాయకులు

మామడ: మండలంలోని పొన్కల్ కేంద్రంగా మండలం ఏర్పాటు చేసే వరకు పోరాటం చేస్తామని మండల సాధన కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండల జేఏసీ ఆధ్వర్యంలో పది గ్రామాల జేఏసీ నాయకులతో సమావేశాన్ని పొన్కల్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలం ఏర్పాటు కోసం చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు. గతేడాది 46 రోజుల పాటు దీక్షలు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కొరిపెల్లి సుధాకర్‌రెడ్డి, సలకం శేఖర్, నర్సారెడ్డి, రాజు, కరుణాకర్‌రెడ్డి, గంగారెడ్డి, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలు ఆచరించండి


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

తానూరు: ప్రపంచానికి శాంతి, అహింస మార్గం చూపిన బుద్ధుడి బోధనలు ఆచరణీయమని పుజ్యబంతే దిపరత్న అన్నారు. ఆదివారం మండలంలోని వడ్గాం గ్రామంలో భారతీయ బౌద్ధమహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్షవాజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బౌద్ధధర్మము ప్రత్యేకతలు అనే అంశంపై మాట్లాడారు. సమాజంలో ప్రజ్ఞ, మైత్రి, కరుణ పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. యువత మత్తు పదార్థాలకు, మూఢ నమ్మకాలకు దూరం ఉంటూ వైజ్ఞానిక మార్గంలో ముందుకు నడవాలన్నారు. బస్టాండ్ ప్రాంతం నుంచి బుద్ధవిహార్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు వాగ్మారే, సంజయ్ సిర్‌సాగర్, ఆత్మరాం, ఆనంద్‌రావ్, సాయినాథ్, ఆయా గ్రామాల భారతీయ బౌద్ధమహా సభ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి


ధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లో సెప్టెంబర్ ఒకటిన నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి(యుఎస్‌పీసీ) నాయకులు కొమ్ము రమేశ్, విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల సంఘ భవనంలో ఆదివారం ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిషన్‌ను నియమించి.. నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని కోరారు. దాసరి శంకర్, పెంట అశోక్, రాజేశ్ నాయక్, మహేంద్రచారి, ధర్మారావు, సుజాత, అంబాజీ, కుర్మ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి సన్మానం

ముధోల్: ముధోల్ అసెంబ్లీ టికెట్ మరోసారి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికే కేటాయించడంపై పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రామచందర్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని ముధోల్‌లోని క్యాంపు కార్యాలయంలో కలిసి సన్మానించారు. కిషన్, దశరథ్, ప్రభాకర్‌గౌడ్, చంద్రశేఖరరావు, రాకేష్, సుమన్, సాగర్‌రావు, రాజేశ్వర్, పోతారెడ్డి, హనుమంతు, రాజు పాల్గొన్నారు.

భైంసాలో బీజేపీ భారీ బైక్‌ర్యాలీ


ర్యాలీలో ఎమ్మెల్యే రాజేశ్‌పవార్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, నాయకులు

భైంసాటౌన్: భైంసా పట్టణంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అసెంబ్లీ ప్రవాస్ యోజన ముగింపు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ర్యాలీలో మహారాష్ట్రలోని నాయగాం ఎమ్మెల్యే రాజేశ్ సంభాజీ పవార్ పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షురాలు రమాదేవి నివాసం నుంచి ఆమె అనుచరులు, ఎస్ఎస్ కాటన్ నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామారావు పటేల్ అనుచరులు, దారాబ్జి నుంచి మోహన్‌రావు పటేల్ అనుచరులు నిర్మల్ రోడ్‌లోని ఎంపీడీవో కార్యాలయం వద్దకు వేర్వేరుగా చేరుకున్నారు. అక్కడి నుంచి పార్టీ జెండాలతో నిర్మల్ చౌరస్తా, బస్టాండ్, మున్సిపల్ చౌరస్తా, భట్టి గల్లీ, పురాణ బజార్, కిసాన్ గల్లీ, బస్టాండ్ మీదుగా నిర్మల్ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు.

ఎవరికి వారే ర్యాలీలో..

బీజేపీ బైక్ ర్యాలీ పోటాపోటీగా సాగింది. జిల్లా అధ్యక్షురాలు రమాదేవితోపాటు ఎమ్మెల్యే టికెట్ రేసులో ఉన్న పవార్ రామారావు పటేల్, భోస్లే మోహన్‌రావు పటేల్ పోటాపోటీగా తమ అనుచరులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అసెంబ్లీ ప్రవాస్ యోజన బాధ్యులుగా ఉన్న మహారాష్ట్ర ఎమ్మెల్యే రాజేశ్ సంబాజీ పవార్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎవరికి వారే తమ బల నిరూపణ కోసం భారీ ఎత్తున అనుచరులతో ర్యాలీలో పాల్గొనడం గమనార్హం.

చెక్కు అందజేత

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామంలో శెట్‌పల్లి నారాయణకు రూ.32 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆదివారం బాధితుడికి చెక్కు అందజేశారు. కొప్పుల లచ్చన్న, రవి, సత్తెన్న, భూమన్న, గంగన్న, శ్రీనివాస్ ఉన్నారు.